
సాక్షి ఒడిశా

మంగళవారం । 25 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,07,658లు, వెండి 10 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రతి మండలంలో ఒక శీతల గిడ్డంగి

కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, రాష్ట్రంలోని ప్రతీ మండలంలో శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని మంత్రి కృష్ణచంద్ర పాత్రో సోమవారం తెలిపారు.

- 8లో



న్యుమోనియాతోనే చిన్నారులు మృతి

కొరాపుట్ జిల్లాలో నలుగురు చిన్నారులు న్యుమోనియాతోనే మృతి చెందారని వైద్య శాఖ ప్రకటించింది.

- 8లో

మూడు జిల్లాల్లో అప్రమత్తం



వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ముఖేష్ మహాలింగ్

- డిప్తీరియా, జాండిస్ కేసులు పెరగడంపై ఆందోళన
- వర్చువల్ విధానంలో మంత్రి ముఖేష్ మహాలింగ్ సమీక్ష
- పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

భువనేశ్వర్: రాష్ట్రంలోని 3 జిల్లాలు అనారోగ్య పరిస్థితుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. అంగుల్, సంబల్‌పూర్, రాయగడ జిల్లాల్లో జపనీస్ ఎన్‌సెఫాలిటిస్ (జేఈ), జాండిస్, డిప్తీరియా వ్యాప్తి చెందడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్ ప్రత్యక్షంగా సమీక్షించారు. ఆయన అధ్యక్షతన సోమవారం వర్చువల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా అధికారులను అప్రమత్తంగా ఉండాలని ప్రభావిత జిల్లాలకు ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో జ్వరాలపై నిఘా పెంచాలని తెలిపారు. ప్రభావిత ప్రాంతాలకు మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి నొక్కి చెప్పారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో పాటు డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్), డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీహెచ్ఎస్) సీనియర్ అధికారులు, మూడు జిల్లాల అధికారులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. గత 10 రోజులుగా రాయగడ, కొరాపుట్, కలహండిలో కొత్త డిప్తీరియా కేసులు నమోదు కాలేదని, పరిస్థితి అదుపులోనే ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించామని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న రోడ్లను మరమ్మతులు చేసి నిర్మించాలని గ్రామీణాభివృద్ధి శాఖను కోరినట్లు సమావేశం అనంతరం మంత్రి తెలిపారు.

82 జాండిస్ కేసులు నమోదు

సంబల్‌పూర్ జిల్లా యంత్రాంగం సమాచారం ప్రకారం ఈనెల 24 నాటికి జిల్లాలో 82 జాండిస్ కేసులు గుర్తించబడ్డాయి. ఆదివారం కేసుల సంఖ్య 74 పరిమితం కాగా, సోమవారం జిల్లాలో కేసుల సంఖ్య 82కి పెరిగింది. వీరిలో 39 మంది హెపటైటిస్-ఏతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితికి కారణం తెలియాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆహార భద్రత శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరా కోసం తాజా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని సంబల్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు, కుమారపడా, బలిబడిలో పైపులైన్లు మార్చాలని వాట్కోకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరిస్థితి అదుపులోకి రాకుంటే సంబల్‌పూర్ వెళ్లి పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో ప్రత్యక్షంగా పర్యవేక్షించడం జరుగుతుందని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్ ఈ సమావేశంలో ప్రకటించారు. అంగుల్‌లో అనుమానాస్పద కేసులపై వివరణ ఇస్తూ, ఇది జేఈ లేదా మరేదైనా వ్యాధి అని పరీక్ష నివేదికలు వచ్చిన తర్వాత మాత్రమే తెలుస్తాయని మంత్రి మహాలింగ్ అన్నారు. పరిస్థితి అదుపులో ఉందని, కొత్త కేసులు ఏవీ నమోదు కాలేదని ఆయన తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉద్యమించాలి



బీజేడీ రాజ్యసభ సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న నవీన్ పట్నాయక్

- బలమైన ప్రతిపక్షంగా ఉందాం
- బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్
- పార్టీ రాజ్యసభ సభ్యులతో సమావేశం

భువనేశ్వర్:

రాష్ట్ర ప్రయోజనాల కోసం బిజూ జనతా దళ్ బలమైన ప్రతిపక్షంగా ఉద్యమించాలని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ సూచించారు. పార్లమెంటులో ఆ పార్టీ పాత్ర, వైఖరిపై చర్చించి నిర్ణయించడానికి బిజూ జనతా దళ్ (బీజేడీ) రాజ్యసభ సభ్యుల సమావేశం సోమవారం నవీన్ నివాస్‌లో జరిగింది. నవీన్ పట్నాయక్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించి పార్టీ కార్యకర్తల్లో మనో ధైర్యాన్ని పెంచారు. సమావేశానికి పార్టీకి చెందిన మొత్తం తొమ్మిది మంది రాజ్యసభ ఎంపీలు హాజరయ్యారు. 147 మంది సభ్యుల రాష్ట్ర శాసనసభలో భారతీయ జనతా పార్టీ మెజారిటీ మార్కు 74 కంటే నాలుగు సీట్లు ఎక్కువ తెచ్చుకున్న సంగతిని నవీన్ పట్నాయక్ రాజ్యసభ సభ్యులకు గుర్తు చేశారు. ఢిల్లీలో బీజేపీ మైనారిటీ ప్రభుత్వాన్ని నడుపుతోందని, అందుకే కష్టపడి, ఐక్యంగా ఉండి, పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఒడిశా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ సంస్థాగత పునాదులను బలోపేతం చేయడానికి వివిధ అంశాలపై చర్చిస్తూ తన నివాసంలో పార్టీ కార్యకర్తలతో నవీన్ పట్నాయక్ నిరంతరం సంభాషిస్తున్నారు.

బీజేడీ వైఖరిపై దృష్టి

గతంలో కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి సమస్య ఆధారిత మద్దతును అందించిన బీజేడీపై ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ప్రాంతీయ పార్టీల వైఖరిని తెలుసుకునేందుకు పరిశీలకులు ఆసక్తిగా ఉన్నారు. ఇటీవల ముగిసిన 2024 అసెంబ్లీ ఎన్నికల్లో బిజూ జనతా దళ్ కేవలం 51 స్థానాల్లో మాత్రమే గెలుపొందింది. అదే సమయంలో ఆ పార్టీ లోక్‌సభ స్థానాలను నిలువునా కోల్పోయింది. కాగా భారతీయ జనతా పార్టీ 78 అసెంబ్లీ నియోజక వర్గాలు, 20 లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడం ద్వారా ఘన విజయం నమోదు చేసుకుంది. ఒక్క లోక్‌సభ స్థానంలో విజయంతో కాంగ్రెస్ తన ఉనికిని చాటుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో పరాజయం తర్వాత బీజేడీ ఎన్నికల చరిత్రలో మొదటిసారిగా లోక్‌సభలో ప్రాతినిధ్యం కోల్పోవడం చర్చనీయాంశమైంది. అయితే బీజేడీ ప్రస్తుతం రాజ్యసభలో తొమ్మిది మంది సభ్యులను కలిగి ఉంది. దీంతో పార్లమెంటు ఎగువ సభలో పార్టీ ముఖ్యమైన పాత్ర పోషించనుంది. దీంతో సమావేశం అనంతరం బీజేడీ ఎంపీ సస్మిత్ పాత్రో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎగువ సభలో రాష్ట్ర ప్రజల వాణిని సమర్థవంతంగా లేవనెత్తాలని పార్టీ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులను కోరినట్లు తెలిపారు. బిజూ జనతా దళ్‌కు చెందిన తొమ్మిది మంది రాజ్యసభ ఎంపీలు పార్లమెంటులో రాష్ట్రానికి బలమైన శక్తిగా నిలుస్తారని, ఒడిశాలోని 4.5 కోట్ల మంది ప్రజల సమస్యలను లేవనెత్తుతారని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే రూపభొత్రకు ఘన స్వాగతం



అవులి గ్రామంలో ఎమ్మెల్యే రూపభొత్రకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

జయపురం: కోట్‌పాడ్ ఎమ్మెల్యేగా గెలిపొందిన బీజేపీ అభ్యర్థి రూపభొత్రకు బొరిగుమ్మ సమితిలో ఘన స్వాగతం లభించింది. కోట్‌పాడ్ నియోజకవర్గంలో అంతర్భాగమైన బొరిగుమ్మ సమితిలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. మొదట సనపారియ గ్రామాన్ని ఎమ్మెల్యే సందర్శించాడు. ఆ గ్రామంలో సాంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన ఆ గ్రామ ప్రజలతో వారి సమస్యలపై చర్చించారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అవులి పంచాయతీలోని అనేక గ్రామాల నుంచి వేలాదిమంది ప్రజలు అవులి గ్రామానికి చేరారు. తమ ఎమ్మెల్యేకు వారంతా సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రగతికి ప్రధానమంత్రి మోదీ చేపడుతున్న అనేక పథకాలు ఒడిశాలో నేటి వరకు గ్రామీణ ప్రజలకు చేరలేదని, అందుకు గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. నేడు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఉన్నటువంటి బీజేపీ ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాయని, ప్రతీ గ్రామానికి పథకాలు చేరుతాయని హామీ ఇచ్చారు. తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు బీజేపీ నేతలు రామకృష్ణ భొత్ర, సుకమణ భొత్ర తదితరులు ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతగా సిలు టీమ్

జయపురం: పట్టణంలోని హనగుడ గ్రామంలో జరుగుతున్న 5టీ క్రికెట్ టోర్నమెంట్‌లో సిలు 11 టీమ్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో సిలు 11 టీమ్, కుంతరకల్ టీమ్‌లు తలపడ్డాయి. టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన కుంతరకల్ టీమ్ నిర్ణీత ఓవర్లలో 95 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం 96 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన సిలు టీమ్ 8.2 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్‌లో 22 బంతుల్లో 46 పరుగులు చేసిన రాజా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. విజేతలకు ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. ఓటమి చెందినవారు నిరాశ చెందకుండా రేపటి విజయానికి తొలిమెట్టుగా భావించాలని సూచించారు. టోర్నమెంట్‌ను సూర్జిత్ రౌత్‌రాయ్, కునా జాని, జోర్డన్ బిసాయ్, సచిన్ నాయిక్, సునీల్ కోళ్ల తదితరులు పర్యవేక్షించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్



పట్టుబడిన ట్రక్కులు

జయపురం: బొరిగుమ్మ సమితి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలపై జయపురం స్టీల్ అండ్ మైన్స్ విభాగ డిప్యూటీ డైరెక్టర్ నేతృత్వంలో ఒక టీమ్ దాడులు చేపట్టింది. ఈ దాడుల్లో 3 ట్రక్కులు, ఒక జేసీబీని సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బొరిగుమ్మ సమితి ఇందనాపూర్ నదిలో టెండర్ లేకుండా అక్రమంగా కొన్ని రోజులుగా రాయగడ జిల్లా పద్మపూర్ ప్రాంతానికి చెందిన సరోజ్ పాఢీ అనే వ్యక్తి ఇసుక రవాణా చేస్తున్నాడని ఇందనాపూర్ గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు. అక్రమంగా ఇసుక తరలింపును గ్రామస్తులు అడ్డుకుంటున్నా అధికారులు, రాజకీయ నేతల సహకారంతో ఆగడం లేదు. దీంతో బిసింగపూర్ పోలీసులతో కలిసి మైన్స్ అధికారులు ఇందనాపూర్ నదీ ఘాట్‌లో దాడులు నిర్వహించారు. ఆ సమయంలో ఇసుక రవాణా చేసే 3 ట్రక్కులతో పాటు జేసీబీని సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న యజమాని నుంచి రూ.15 లక్షల జరిమానా వసూలు చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఇందనాపూర్ నది ఘాట్ వద్ద ఇసుక దిబ్బలు

వైభవంగా ఊయల సంబరం



పూజారి, పూజారమ్మలు ఊయలూగుతున్న దృశ్యం



ఉత్సవాలకు విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే కద్రక

రాయగడ: గ్రామ దేవత ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఊయల సంబరం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఊయలకు సంబంధించిన దుంగలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊయలుగా ఏర్పాటు చేశారు. నగర పరిక్రమణ అనంతరం అమ్మవారు ఈ ఊయల ఊగుతూ ఆనందంతో పరవశిస్తుంది. ఈ ఘట్టాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రధాన పూజారి బలముండ, పూజారమ్మ సరోజినిలను ఊయలలో కూర్చొబెట్టి ఊగించారు. అనంతరం అమ్మవారి అక్కాచెల్లెల్లుగా భావించే మిగతా ఘటాలతో పేరంటాలు కూడా ఊగడంతో ఈ ఘట్టం ముగిసింది. ఇదిలా ఉండగా రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అమ్మవారి దర్శనం కోసం ఆదివారం రాత్రి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డుకు వచ్చారు. అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్న అనంతరం కమిటీ వారితో కాసేపు మాట్లాడారు. మందిరం అభివృద్ధికి సంబంధించి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఉత్సవాలకు సంబంధించి ఆయన రూ.5 వేలు విరాళంగా అందించారు.

పాముకాటుతో బాలుడి దుర్మరణం



మృతి చెందిన వివేక్



గ్రామస్తులు చంపిన పాము

రాయగడ: నిద్రిస్తున్న సమయంలో ఒక పాము కాటు వేయడంతో నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన జిల్లాలోని బిసంకటక్ సమితి గొంటిఖాల్ గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడు అదే గ్రామానికి చెందిన రబి సరక కొడుకు వివేక్ సరకగా గుర్తించారు. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే భోజనం చేసి ఆరుబయట పడుకున్న వివేక్‌కు పాదల నుంచి వచ్చిన ఒక పాము కాటు వేసింది. దీంతో ఏడ్చిన వివేక్‌ను చూసిన తల్లిదండ్రులు చుట్టుపక్కల పరిశీలించగా, ఒక పాము అటువైపుగా వెళ్తుండడం గమనించి వెంటనే చికిత్స కోసం బిసంకటక్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే కాటువేసిన పామును గ్రామస్తులు కొట్టి చంపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: ఈనెల 28వ తేదీన జరగనున్న జయపురం మహారాజు రాజశ్రీ విక్రమదేవ్ వర్మ 156వ జయంతి సందర్భంగా స్థానిక మోడ్రన్ ఆంగ్ల పాఠశాల ప్రాంగణంలో వక్తత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు శనివారం నిర్వహించారు. జయపురం సాహిత్య సంసద్ నిర్వహించిన ఈ పోటీల్లో జయపురం, కొరాపుట్ ప్రాంతాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 82 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ సురేష్ దాస్, డాక్టర్ జుగల్ కిశోర్ మిశ్ర, గాయిత్రీ పాణిగ్రహి, పద్మచరణ చౌదరి, అర్జున్ నాయిక్‌లు వ్యవహరించారు. పోటీలను రమేష్ చంద్ర బెహర, శుభశ్మిత సాహు, హషికేష్ పాణిగ్రహి, రాజ్యలక్ష్మీ పండ, కాంచన మాలా సాబత్, దీపిక గొడ్, సౌభాగిణి నందో, సత్యభామ సాహు, అనిత మిశ్ర, శర్మిష్ట బిశ్వాల్, గోపాల కృష్ణ మహరాణ, కుని మహంతి, బాసుదేవ మహాపాత్రో, సతీష్ రాజు తదితరులు పర్యవేక్షించారు.

ఎలుగుని బంధించిన అటవీ శాఖ సిబ్బంది



ఎలుగు పిల్లను బంధించిన దృశ్యం

కొరాపుట్: వనం నుంచి జనంలోనికి వచ్చిన ఎలుగుబంటి పిల్లని అటవీ శాఖ సిబ్బంది బంధించారు. సోమవారం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి గుణ పంచాయతీ బుధ్రపార గ్రామంలోకి ఎలుగుబంటి ప్రవేశించింది. ఈ విషయంపై గ్రామస్తులు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఏసీఎఫ్ అధికారి సుభాష్ చంద్ర ఖుంటియా నేతృత్వంలో సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. ఒక నిర్మాణంలో ఉన్న ఇంటిలో ఎలుగుబంటిని గుర్తించారు. నాలుగు గంటలు శ్రమించి దానిని బోనులో బంధించారు. అనంతరం రాయిఘర్ పశు వైద్యశాలకి తరలించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పపడాహండిలోని వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి తరలించారు. దాని వయస్సు 4 సంవత్సరాలు ఉంటుందని, బరువు ఒక క్వింటాల్‌గా నమోదు చేశారు. గుణ ప్రాంతంలో మొక్కజొన్న పంట సాగు ఎక్కువగా జరుగుతుంది. అడవులు అంతరించిపోవడంతో ఎలుగులు ఆహారం కోసం మొక్కజొన్న పంట వైపు వస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మంత్రి నిత్యానంద గోండో చాంబర్‌లో పూజలు



పూజలు నిర్వహిస్తున్న మంత్రి నిత్యానంద గోండో

కొరాపుట్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి నిత్యానంద గోండో తన కార్యాలయంలో ప్రవేశించారు. సోమవారం భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లోని తన నూతన చాంబర్‌లో పూజలు నిర్వహించారు. తన శాఖ పరిధిలోని అధికారులు హాజరయ్యారు. అనంతరం నిత్యానంద మాట్లాడుతూ తనను మంత్రి హోదాలో చాంబర్‌లో కూర్చోబెట్టిన నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ అసెంబ్లీ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు.

ఆయుర్వేద వైద్యంలో ఒడిశాది అగ్రస్థానం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

- జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



ఉత్తమ వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

జయపురం: ఆయుర్వేద వైద్యంలో దక్షిణ ఒడిశాది అగ్రస్థానమని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. స్థానిక టౌన్ హాల్‌లో దక్షిణ ఒడిశా ఆయుర్వేద వికాస పరిషత్ నిర్వహించిన వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవిభక్త కొరాపుట్, గంజాం జిల్లాల్లో లభించే ఆయుర్వేద వైద్యం దేశంలో మరెక్కడా లభించదని అభిప్రాయపడ్డారు. గంజాం జిల్లాలో వందల ఏళ్ల నుంచి ఆయుర్వేదం ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. పేద ప్రజలకు చౌకగా లభించే ఈ వైద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ ఒడిశా ఆయుర్వేద వికాస పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సుదర్శన్ గౌఢ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యవక్తగా కవి ప్రకాశ మిశ్ర మన దేశంలో ఆయుర్వేద వైద్య పూర్వపరాలపై వివరించారు. గౌరవ అతిథులుగా సొరడ నుండి వచ్చిన దివ్య ఫార్మ్ సంస్థ వ్యవస్థాపకులు ఉపేంద్ర పాత్రో, నీలాంచల శతపతి, ద్వితికష్ట శతపతి, కాశీనగర్ నుంచి వచ్చిన ప్రకాష్ పాత్రో తదితరులు ప్రసంగిస్తూ పేదలకు అందుబాటులో ఉంచేందుకు ఆయుర్వేద వైద్యానికి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పరిషత్ సలహాదారు శ్రీరామ గౌఢ, సహాయక కార్యదర్శి వైద్య సత్యనారాయణ పరిచ, కోశాధికారి భవానీ చరణ్ ఆచార్య, డాక్టర్ జినియారాణి మహంకుడో, డాక్టర్ ప్రశాంత పొరిడ, డా.ప్రశాంత సాహు, మదన మోహన్ నాయిక్, మాధవ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎవరో వస్తారని ఎదురుచూడక..!



ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురుచూసి మోసపోకుమా అన్నాడు ఒక మహాకవి. అది అక్షర సత్యమని తెలుసుకున్నారేమో కొరాపుట్ జిల్లా దసమంతపూర్ సమితి లుల్లా గ్రామ పంచాయతీ తెంతులిగుడ గ్రామ ప్రజలు. తమ గ్రామానికి పక్కా రోడ్డు లేదు. అందువలన అక్కడి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. తమ గ్రామానికి రోడ్డు వేయాలని అనేక పర్యాయాలు బీడీవో నుంచి కలెక్టర్ వరకు, ఎమ్మెల్యే నుంచి మంత్రుల వరకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. నాయకులు, అధికారులు ఎవరూ తమను పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఇక ఎదురు చూడకూడదని గ్రామస్తులందరూ నిర్ణయానికి వచ్చారు. శ్రమదానంతో రోడ్డు వేసుకోవాలని తీర్మానించారు. దీనిలో భాగంగా రోడ్డు పనులు ప్రారంభించారు. 3 కిలోమీటర్ల పక్కా రోడ్డు వేస్తే కేవలం తెంతులిగుడ గ్రామ ప్రజలే కాకుండా, మరో ఐదు గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణాన్ని వర్షాలు పడకముందే పూర్తి చేస్తామని తెలియజేశారు.

- జయపురం

న్యూస్‌రీల్

చీపురు కోత యంత్రాలు మంజూరు



మంజూరైన చీపురు కోత యంత్రాలు

సారవకోట: సీతంపేట ఐటీడీఏలోని వందన్ వికసిత్ కేంద్రం ద్వారా చీపురు కోత యంత్రాలు మంజూరైనట్లు ఏపీఎం గోవిందరాజులు తెలిపారు. స్వయం శక్తి సంఘాల్లో ఉండి చీపురు సాగు చేసే గిరిజనులకు ఈ యంత్రాలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. ఈ యంత్రం ద్వారా ఆ గ్రామంలో ఉండే చీపురు సాగు చేసే గిరిజనులంతా వాడుకునేందుకు అవకాశం ఉందన్నారు. సంఘాల ద్వారా తీర్మానం చేసి పంపించామని ప్రస్తుతం 10 యంత్రాలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వీటిని త్వరలో ప్రజాప్రతినిధుల ద్వారా ఆయా సంఘాలకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

జూలై 1న మహా ధర్నా విజయవంతం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీఆర్ఏయూ మాజీ ఉపకులపతి నిమ్మ వెంకటరావు చేపట్టిన నియామకాలు రద్దు చేయాలని కోరుతూ జూలై 1 సోమవారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు కోరారు. శ్రీకాకుళం నగరంలోని ఇల్లిసిపురంలో గల అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో సోమవారం కరపత్రం ఆవిష్కరించి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ఉపకులపతి వేసిన కమిటీల నివేదికలను తక్షణమే బహిర్గతం చేయాలని కోరారు. వర్సిటీలో తక్షణం అంబేడ్కర్ చైర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ మొత్తం ఉద్యోగుల్లో 15 మంది మాత్రమే ఎస్సీ ఎస్టీలు ఉండడం చాలా అన్యాయమన్నారు. జూలై 1తేదీ నాటికి 34 మందిని తొలగించి కొత్త నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల అప్పారావు, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకర్, అంబేడ్కర్ చైర్ సాధన సమితి కన్వీనర్ టొంపల రమణ, వన్నలి లక్ష్మీనారాయణ, నేతల అప్పారావు, నేతల ఆదినారాయణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

'అర్జీలపై చట్టపరంగా విచారణ చేస్తాం'



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి చట్టపరంగా విచారణ చేసి న్యాయం జరిపిస్తామని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కారం కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ వేదికలో మొత్తంగా 34 ఫిర్యాదులు రాగా అందులో మోసపూరితమైనవి 2, ఆస్తి నేరాలు 1, మిస్సింగ్ కేసులు 3, కుటుంబ తగాదాలు 6, సివిల్ సంబంధిత అంశాలపై 12, ఇతరమైనవి 10 ఫిర్యాదులు అందాయి. ఎస్పీతో పాటుగా అదనపు ఎస్పీలు జి.ప్రేమ్ కాజల్, వి.ఉమామహేశ్వరరావులు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

'జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. రానున్న శనివారం జరగనున్న లోక్ అదాలత్‌పై ఆయన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని కోర్టుల్లో ప్రతి రోజూ రెండో పూట పోలీసు కేసులను రాజీ చేసేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. ఎక్సైజ్ కేసులపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ కేసులన్నీ రాజీ చేసుకోవాలని సూచించారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం సుప్రీంకోర్టు జూలై 27 నుంచి ఆగస్టు మూడు వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ప్రతి మండలంలో ఒక శీతల గిడ్డంగి



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కృష్ణచంద్ర పాత్రో

- ఆహార సరఫరాల శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో

భువనేశ్వర్: కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, రాష్ట్రంలో ప్రతీ మండలంలో శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని ఆహార సరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో సోమవారం తెలిపారు. నిత్యావసర కూరగాయల ధరలు చుక్కలను తాకడంతో మార్కెట్ పరిస్థితులను పరిశీలించేందుకు సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాసిక్, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి ఉల్లి దిగుమతితో దైనందిన అవసరాలు గట్టెక్కించుకుంటున్నామన్నారు. రవాణా ఖర్చులు, హోల్‌సేల్ వ్యాపారులు, చిల్లర వ్యాపారుల లాభాల సర్దుబాటుతో కలిపి మార్కెట్‌లో ఉల్లి తుది విక్రయ ధర కిలో రూ.40కి చేరుతుందని పేర్కొన్నారు.

అక్రమ నిల్వల కట్టడికి చర్యలు

కూరగాయలు అక్రమంగా, అనధికారికంగా నిల్వ ఉంచడంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, ఎవరైనా వినియోగదారులను దోపిడీకి గురిచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. అదేవిధంగా పశ్చిమ బెంగాల్, అస్సాంలో బంగాళా దుంపల ధరలు పెరగడంతో రాష్ట్రంలో కూడా ఆలుగడ్డ ధరలు గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలో టమాటా, ఇతర కూరగాయల ధరలు పెరుగుతుండటంపై మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం పరిష్కారానికి ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో టమాటా, ఇతర కూరగాయల ధరలు పెరుగుతుండటంపై ప్రభుత్వానికి నియంత్రణ లేదని తేల్చేశారు. రాష్ట్రంలోని ప్రతీ మండలంలో శీతల గిడ్డంగుల్ని ప్రారంభించడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చన్నారు. ప్రస్తుతానికి ధరల తగ్గుదలపై ఆలోచన చేస్తున్నామని పేర్కొన్నారు.

త్వరలో రత్న భాండాగారం తెరుస్తాం

- న్యాయశాఖ మంత్రి హరిచందన్

భువనేశ్వర్: శ్రీజగన్నాథ దేవాలయంలోని రత్న భాండాగారం తెరిచే తేదీ, విధివిధానాలను త్వరలో ప్రకటిస్తామని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ సోమవారం తెలిపారు. రత్న భండార్‌పై నిర్ణయం తీసుకునే పనిలో ప్రభుత్వం నిమ్నగ్నమైన ఉందన్నారు. ఆలయ గర్భగుడి సమీపంలో ఉన్న రత్న భాండాగార్ ఆలయం యొక్క అత్యంత విలువైన నిధి అని చెప్పవచ్చు. ఇందులో వజ్రాలు, బంగారం, వెండితో సహా దేవస్థానం అనేక అమూల్యమైన ఆభరణాలు ఉన్నాయి. ఆలయ నియమాలు మరియు ఆచారాల ప్రకారం జగన్నాథునికి సమర్పించే బంగారం, వెండి, వజ్ర వైడూర్యం వంటి అమూల్య రత్న సంపద, నిత్య వినియోగ వెండి సామగ్రి రత్న భండారంలోని రెండు గదుల్లో భద్రపరచి ఉన్నాయి. యాత్రలు, ఉత్సవాలు ఇత్యాది పలు సందర్భాల్లో దేవతల ఆభరణాల వినియోగం కోసం బయటి గది మాత్రమే తెరుస్తున్నారు. అక్కడ నిల్వ భద్రపరిచిన నగలు, విలువైన వస్తువులు జగన్నాథుని స్వర్ణాలంకారం సమయంలో ఉపయోగిస్తున్నారు. 1978లో సొత్తు లెక్కింపు అనుబంధ పరిశీలన కోసం చివరిగా లోపలి గది తెరిచారు. తిరిగి ఇప్పటివరకు దీనిని తెరవకపోవడం చర్చనీయాంశమైంది. జగన్నాథ ఆలయ చట్టం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి రత్న భండార్ లోపలి గదిలో ఉంచిన విలువైన వస్తువులన్నింటిపై ఆడిట్ జరగాలి. అయితే 1978 నుంచి రత్న భండార్ లోపలి గదికి సరైన ఆడిట్ లేదు. ఆలయ అధికారిక గ్రంథం అయిన మాదల పంచాంగం ప్రకారం అనంగభీమ దేవ్ రాజు జగన్నాథుని అలంకారానికి 250 కిలోల పైబడి బంగారు ఆభరణాలు విరాళంగా ఇచ్చినట్లు సమాచారం.

హత్యకేసు నిందితుడికి జీవిత ఖైదు



రాజేష్‌ను పోలీసులు తీసుకెళ్తున్న దృశ్యం

రాయగడ: ఒక హత్య కేసుకు సంబంధించి విచారించిన జిల్లా జడ్జి సత్యనారాయణ షడంగి నిందితుడు రాజేష్ కులిసికకు యావజ్జీవ కారాగార శిక్షణ విధిస్తూ సంచలన తీర్పునిచ్చారు. సోమవారం ఆయన ఈ కేసుకు సంబంధించి 13 మంది వాగ్మూలంతో పాటు ప్రత్యక్ష సాక్షులను విచారించిన అనంతరం ఈ మేరకు తీర్పును ఇచ్చారు. దీంతో పాటు మరో రూ.10 వేలు జరిమానా కింద నిందితుడు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. కేసును పరిశీలిస్తే.. 2022 సెప్టెంబర్ 5వ తేదీన స్థానిక రైతుల కాలనీలో నివసిస్తున్న రాజేష్ తన పొరుగు ఇంటిలో నివాసముంటున్న చంద్రమ బిభార్ అనే మహిళను చేతబడి చేస్తుందనే నెపంతో హత్య చేశాడు. దీనిపై పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసు విచారణకు రాగా వాదోపవాదాలు విన్న జిల్లా జడ్జి షండగి తీర్పు వెల్లడించారు.

గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు ఐఐసీ ధీరెన్ పట్నాయక్ నేతృత్వంలో ఆదివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో కోరుకొండ సమితి పాత చిమ్టాపల్లి పంచాయతీ అంబగూడ గ్రామం వద్ద ఒక వ్యక్తి బైక్‌పై అతివేగంగా రావడంతో ఆపి తనిఖీలు నిర్వహించారు. దీంతో ఆయన వద్ద రెండు బస్తాల్లో 15 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో ఆయనను అరెస్టు చేసి విచారించగా, మల్కన్‌గిరి సమితి ఎంవీ 26 గ్రామానికి చెందిన అశోక్ మిస్త్రీగా నిర్ధారించారు. కేసు నమోద్ చేసి ఈ రోజు సోమవారం కోర్టులో హాజరయ్యారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.80 వేలు ఉంటుంది వెల్లడించారు.

పోలీసుస్టేషన్‌లో ప్రేమ వివాహం



పెళ్లి దండలు మార్చుకుంటున్న ప్రేమికులు

కొరాపుట్: జిల్లాలోని నందపూర్ సమితి పాడువా పోలీసుస్టేషన్‌లో సోమవారం ప్రేమ వివాహం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. బడలి గ్రామానికి చెందిన రవీంద్ర జెన్న, మంజులా హంతల్‌లు ప్రేమించుకున్నారు. వీరిద్దరి ప్రేమకి పెద్దలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈనెల 3వ తేదీన గ్రామం నుంచి పారిపోయారు. అయితే వీరికోసం గాలింపు మమ్మురం అవ్వడంతో గ్రామ సరిహద్దులో 6వ తేదీన మంజులని విడిచి రవీంద్ర అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అయితే రవీంద్ర మరలా రాకపోవడంతో ఈనెల 21వ తేదీన మంజుల పాడువ పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించింది. పోలీసులు గాలించి రవీంద్రని పట్టుకొచ్చారు. అనంతరం ఇరు కుటుంబాలు, గ్రామ పెద్దలను పిలిపించి వివాహం జరిపించారు. గ్రామ పెద్దలు, పోలీసులు వీరిద్దరినీ ఆశీర్వదించి ఇళ్లకు పంపించారు.

కుండపోత వర్షం



వర్షం కురుస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరిలో సోమవారం సాయంత్రం ఉరుములతో కూడిన కుండపోత వర్షం కురిసింది. దీంతో గత పది రోజులుగా ప్రజలు అనుభవిస్తున్న ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

ఆర్.ఉదయగిరి, రామగిరి, మండలసాయి తదితర గ్రామాల్లో వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పలాసలో అదృశ్యం.. సికింద్రాబాద్‌లో ప్రత్యక్షం



సికింద్రాబాద్ జీఆర్పీ స్టేషన్‌లో చైతన్య

కాశీబుగ్గ: పలాసలో అదృశ్యమైన విద్యార్థి తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో ప్రత్యక్షమయ్యాడు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తాళ్లభద్ర చైతన్య ఈనెల 21న ట్యూషన్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి పారిపోవడంతో తల్లి విజయ తీవ్ర ఆందోళనకు గురైంది. ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్న తండ్రి తాళ్లభద్ర చంద్రారావు జమ్మూ కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. 24వ తేదీ సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో విద్యార్థి దొరికాడు. సోషల్‌మీడియా, సాక్షి దినపత్రికలో ప్రచురణలు చూసి అనేక మంది బాలుడికి వెతికారు. ఈ నేపథ్యంలో ఆమదాలవలసకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ చైతన్యను సికింద్రాబాద్‌లో గుర్తించి పట్టుకుని తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. అనంతరం సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో సపర్యలు చేసి హైదరాబాద్‌లో ఉన్న బాలుడి బంధువులకు అప్పగించారు. బాలుడు ఎందుకు ఇంటి నుంచి వెళ్లిపోయాడో తెలియాల్సి ఉంది.

'విద్యను వ్యాపారంగా మార్చడం సరికాదు'



భవిష్యత్ కార్యాచరణ కరపత్రాన్ని చూపిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యార్థులకు సక్రమంగా పాఠాలు చెప్పి విద్యాబుద్ధులు నేర్పించాల్సిన విద్యా సంస్థలు పూర్తిగా వ్యాపార సంస్థలుగా మారి పుస్తకాలు, బట్టలు, ఫీజుల పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, హరీష్‌లు మండిపడ్డారు. నారాయణ విద్యాసంస్థల్లో మరీ దారుణంగా పుస్తకాలకు రూ.15వేలు నుంచి రూ.20వేలు వరకు వసూలు చేస్తున్నారని, ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో గల నారాయణ విద్యా సంస్థలలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని దీక్ష ఒకు చెప్పినా పట్టించుకోలేదని తెలిపారు. నారాయణ విద్యాసంస్థల్లో విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పుస్తకాలు, యూనిఫామ్‌లను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా శాఖ అధికారులు దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని పేర్కొన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, తిరుపతి, కమిటీ సభ్యులు యశ్వంత్, భూపతి సాయి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతిపై ఆందోళన



ఆందోళనతో నిలిచిపోయిన వాహనాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ కేంద్రం కాలేజీ జంక్షన్ వద్ద సోమవారం ఉదయం స్థానికులు ఆందోళన జరిపారు. మోహనాలో కార్మికుడు మున్నా నాయక్ ఒక ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా కరెంటు షాక్‌తో మూడంస్తుల భవనం మీద నుంచి పడి మృత్యువాత పడ్డాడు. మృతుడు మోహనా నియోజకవర్గం ఖరిగుడ గ్రామానికి చెందినవాడు. దీంతో కోపోద్రిక్తులైన శ్రామికులు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, నష్టపరిహారం అందజేయాలని కాలేజ్ జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో రాయగడ, బరంపురం, పర్లాకిమిడి ముఖ్య రహదారి బంద్ చేయడంతో అనేక వాహనాలు గంటలకొద్దీ నిలిచిపోయాయి. అనంతరం మోహనా ఐఐసీ, మోహనా బీడీవో, తహసీల్దార్లు సంఘటన స్థలానికి విచ్చేసి ఆందోళనకారులతో మాట్లాడి నిరసన విరమింపజేశారు.

న్యుమోనియాతోనే చిన్నారులు మృతి

- వైద్యశాఖ ప్రకటన



లక్ష్మీపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

కొరాపుట్: జిల్లాలో నలుగురు చిన్నారులు న్యుమోనియాతోనే మృతి చెందారని వైద్య శాఖ ప్రకటించింది. సోమవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలో ఏడీపీహెచ్‌వో డాక్టర్ ముక్తి కాంత్ ఖటువా మీడియాతో మాట్లాడారు. జిల్లాలో నారాయణపట్న, బందుగాం, లక్ష్మీపూర్ సమితుల్లో డిఫ్తీరియాతో చిన్నారులు మృతి చెందారనే వార్తల్లో వాస్తవం లేదన్నారు. చిన్నారులు న్యుమోనియాతోనే మృతి చెందారని స్పష్టం చేశారు. బాధిత గ్రామాల్లో ఇప్పటికే వైద్య బృందాలు చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. మరోవైపు నారాయణపట్న సమితి బలిపేట గ్రామ పంచాయతీ గొట్టిగుడ గ్రామంలో ఇప్పటికే ఇద్దరు చిన్నారులు మృతి చెందగా, సోమవారం ఉదయం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో మరో చిన్నారి చికిత్స పొందుతూ చనిపోయింది. లక్ష్మీపూర్, నారాయణపట్న, బందుగాం, దశమంత్‌పూర్ సమితుల్లోని అనేక గ్రామాల్లో చిన్నారులు జ్వరంతో బాధపడుతున్నారు. ఇప్పటికి రెండు వారాలుగా ఇదే పరిస్థితి ఉంది. మృతుల సంఖ్య నాలుగుకి చేరడంతో వైద్య శాఖ అప్రమత్తమయ్యింది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



అడవిలో గుర్తు తెలియని మృతదేహం



సమీపంలో లభ్యమైన చెప్పులు, బనియన్

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి గుపాగూడ అడవిలో సోమవారం ఒక గుర్తు తెలియని మృతదేహం లభించింది. దీంతో గ్రామస్తులు గుర్తించి ఖోయిర్‌పూట్ పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కొరాపూట్‌లోని సైంటిఫిక్ బృందానికి సమాచారం అందజేశారు. అస్థి పంజరాన్ని ప్రస్తుతం ఖోయిర్‌పూట్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ మృతదేహం ఒక లుంగీలో చుట్టబడి ఉంది. సమీపంలో చెప్పులు, బనియన్ ఉన్నాయి.

అభినందనలు



లాగోస్‌లో జరిగిన ప్రపంచ టేబుల్ టెన్నిస్ పోటీల్లో సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకున్న మొదటి భారతీయ పాడ్లర్‌గా చరిత్ర సృష్టించినందుకు శ్రీజ ఆకులని నవీన్ పట్నాయక్ అభినందించారు. ఆమె తన విజయ పరంపరను కొనసాగించి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. – భువనేశ్వర్

మూడు నెలల తర్వాత..

- ప్రజా సమస్యల పరిష్కార వేదిక పునః ప్రారంభం
- 'మీ కోసం' పేరిట ప్రజా గ్రీవెన్స్ నిర్వహణ
- అర్జీలు స్వీకరించిన అధికారులు



మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూడు నెలల తర్వాత ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం పునః ప్రారంభమైంది. గత ఐదేళ్ల నిర్వహించిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసి ఆ స్థానంలో నూతన ప్రభుత్వం 'మీ కోసం' అన్న పేరిట ప్రజా గ్రీవెన్స్ సెల్‌ను తీసుకువచ్చింది. కొత్త ప్రభుత్వంలో తొలి సారిగా సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలు సత్వరం పరిష్కరించాలని జేసీ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేసీతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహన్ రావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫిర్యాదుల స్వీకరణ ఈ రోజు ప్రారంభమైందని అన్నారు. మీ కోసం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

భార్య చేతిలో భర్త హతం



టెర్రస్‌పై రక్తపు మడుగులో కుప్పయ్య మృతదేహం

- కుమారుడి మృతికి ప్రతీకారం
- గత ఏడాది జూన్ 25వ తేదీన కుమారుడిని హత్య చేసిన కుప్పయ్య
- సరిగ్గా ఏడాదిలోగా ప్రతీకారం తీర్చుకున్న వైనం
- కుప్పిలిలో కలకలం

ఎచ్చెర్ల క్యాంపస్: అనుమానం, దాడి, హత్యలు వంటి ఘటనలతో ఓ కుటుంబం ఛిద్రమైపోయింది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త దాడికి పాల్పడడం, ఆ దాడిలో అడ్డుగా వచ్చిన కొడుకు చనిపోవడం, ఆ తర్వాత అతను జైలు జీవితం అనుభవించడం, ఏడాది తర్వాత సొంతూరికి రావడం, ప్రతీకారంతో రగిలిపోతున్న భార్య చేతిలో చనిపోవడం.. సినిమా కథను తలపించే ఈ ఘటనలకు మండలంలోని కుప్పిలి వేదికైంది. గ్రామంలో కొంద్ర కుప్పయ్య (55) అనే వ్యక్తిని ఆదివారం రాత్రి అతని భార్య హరమ్మ కత్తితో దాడి చేసి చంపేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..



భార్యాభర్తలు కుప్పయ్య, హరమ్మ (ఫైల్)

గత ఏడాది జూన్ 25న కుప్పయ్య తన సొంత కొడుకునే చంపేశాడు. భార్య హరమ్మపై అనుమానం పెంచుకుని ఆ రోజు ఆమెపై కుప్పయ్య దాడికి ప్రయత్నించాడు. పెద్ద కుమారుడు తాతారావు అడ్డువచ్చాడు. దీంతో అతడిని కత్తితో నరికేశాడు. కుమారుడు సంఘటన స్థలంలోనే మృతి చెందగా, భార్య గాయాలతో బయట పడింది. అనంతరం పోలీసులు కుప్పయ్యను అరెస్టు చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చిన కుప్పయ్య సొంతూరికి రాకుండా శ్రీకాకుళం పట్టణంలో కూలి పని చేసుకుంటూ గ్రామానికి, కుటుంబానికి దూరంగా ఉంటూ బతికాడు. అయితే కుప్పిలిలో చాలా ఏళ్ల తర్వాత అసిరితల్లి అమ్మవారి గ్రామ దేవత ఉత్సవాలు వచ్చాయి. దీంతో కుప్పయ్య గ్రామానికి వచ్చాడు. పండగ పూర్తయినా వెళ్లలేదు. దీంతో భార్య హరమ్మ అతడిని నిలదీసింది. తాను ఎక్కడకూ వెళ్లనని, ఇక్కడే వ్యవసాయం చేసుకుంటూ బతుకుతానని చెప్పాడు. కళ్ల ముందే కుమారుడిని చంపేయడం, తనను హింస పెట్టడం వంటి సంఘటనలతో హరమ్మ భర్తపై కక్ష పెంచుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కుప్పయ్య తన ఇంటి మేడపై నిద్రపోతుండగా.. హరమ్మ అతడిని చంపేయడానికి పథకం వేసింది. ముందుగానే పదునైన కత్తిని ఇంటిలో ఉంచుకుంది. అర్ధరాత్రి దాటాక నిద్రపోతున్న వ్యక్తిపైనిర్దాక్షిణ్యంగా దాడి చేసింది. మెడ భాగమే లక్ష్యంగా దాడి చేయడంతో కుప్పయ్య సంఘటన స్థలంలోనే ఊపిరి వదిలేశాడు. అనంతరం ఆమె ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయింది. సంఘటన స్థలాన్ని జేఆర్ పురం సీఐ రామచంద్రరావు, ఎస్ఐ చిరంజీవి సిబ్బంది వచ్చి పరిశీలించారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్నకుమార్తె, చిన్న కుమారుడికి వివాహాలు జరగలేదు. పెద్ద కుమారుడు హత్యకు గురయ్యాడు. కుటుంబంలో జరిగిన సంఘటనలతో వీరు బిక్కచచ్చిపోయారు.

నిందితురాలికి రిమాండ్

భర్త కొంద్ర కుప్పయ్యను కిరాతకంగా హత్య చేసిన హరమ్మను ఎచ్చెర్ల పోలీసులు సోమవారం సాయంత్రం అరెస్టు చేశారు. హత్య చేసి పోలీసులకు స్వచ్ఛందంగా లొంగిపోవటంతో విచారణ అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లా కోర్టులో హాజరు పర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

క్లుప్తంగా

పాముకాటుతో రైతు మృతి


పాముకాటుతో మృతి చెందిన రైతు వెంకటరమణ

జామి: మండలకేంద్రానికి చెందిన రైతు రాయవరపు ఎర్ని వెంకటరమణ(68) సోమవారం తన పొలంలో పాము కాటుతో మృతిచెందాడు. రైతు తన పొలంలో ఉన్న మొక్కలకు మందు కొడుతున్న సమయంలో పాటు కాటు వేసింది. దీంతో వెంటనే పొలం నుంచి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు పాముకాటు విషయాన్ని చెప్పగా స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అయితే అప్పటికే వెంకటరమణ మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పిడుగు పడి ఆవు


మృతిచెందిన ఆవు

జామి: మండలంలోని జన్నివలస గ్రామంలో పిడుగుపడి ఆవు మృతిచెందింది. గ్రామానికి చెందిన కృష్ణమ్మ ఆవు పొలంలో మేస్తున్న సమయంలో వర్షంతో పాటు పిడుగు పడడంతో మృతిచెందింది. ఆవు ఖరీదు సుమారు రూ.50 వేలు ఉంటుందని రైతు కృష్ణమ్మ ఆవేదన వ్యక్తం చేసింది.

చికిత్స పొందుతూ వృద్ధుడు

రాజాం సిటీ: పట్టణ పరిధి సారథి గ్రామానికి చెందిన వంజరాపు సన్యాసినాయుడు (74) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని ఏఎస్సై లక్ష్మీనాయుడు తెలిపారు. గ్రామానికి చెందిన సన్యాసినాయుడుకు మతిస్థిమితంలేక, సరిగా నిద్రపట్టకపోవడంతో ఈ నెల 23న రాత్రి 11 గంటల సమయంలో వ్యవసాయానికి ఉపయోగించే గడ్డి మందు తాగేశాడు. విషయం గమనించిన కుటుంబసభ్యులు వెంటనే రాజాం కేర్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడని మృతుని కుమారుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

పిడుగు పాటుతో వ్యక్తి

గంట్యాడ: మండలంలోని వసాది గ్రామానికి చెందిన బోదంకి ఎర్నాయుడు (47) సోమవారం సాయంత్రం పొలంలో పిడుగు పాటుకు గురై మృతి చెందాడు. పొలంలో పనిచేస్తుండగా ఆకస్మాత్తుగా ఎర్నాయుడిపై పిడుగు పడడంతో చెవిలో నుంచి రక్తం రావడంతో పాటు శరీరంతా కాలిపోయింది. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్ర నాయుడు తెలిపారు.

కిరాణా షాపు కాల్చివేత


కాలిపోతున్న కిరాణా షాపు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో ఓ కిరాణా షాపును గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి కాల్చివేశారు. ఈ ఘటనపై బాధిత కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కలిశెట్టి పైడమ్మ కొన్నేళ్ల నుంచి గ్రామంలో కిరాణా షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. గుర్తు తెలియని వ్యక్తులు షాపును కాల్చివేశారని బాధితురాలు ఆరోపించింది. ఈ ఘటనలో సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు వాపోయింది. ఈ నేపథ్యంలో బాధితురాలి కుమారుడు కలిశెట్టి సత్యనారాయణ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితులను పట్టుకుని తమకు న్యాయం చేయాలని కోరాడు.

జాబ్‌మేళా విజయవంతం


ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు, కంపెనీ ప్రతినిధులు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. సోమవారం కళాశాల ఆవరణలో హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఇంటర్వ్యూ ఆధారంగా ప్రాథమికంగా 18 మందిని ఎంపికచేశారు.ఎంపికైన వారికి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.ఉషశ్రీ, ఐక్యుఎసి కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్య పరిష్కారం కావాలి

• కలెక్టర్ నిషాంత్‌కుమార్


పార్వతీపురం: వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి సమస్యా పరిష్కారం కావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సమస్య పరిష్కారం దిశగా యోచిస్తుందని చెప్పారు. సుపరిపాలన, సమర్థత, అవినీతి రహిత వ్యవస్థ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీలలోనూ మంచినీటి ట్యాంక్‌లను శుభ్రపరచాలని, శుభ్రపరిచేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మంచినీటి పైపులు ఎక్కడైనా లీకులు ఉన్నాయా లేదో తనిఖీ చేసి, లీకులు ఉంటే పైపులు మార్చాలని జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. డ్రైనేజీ ప్రదేశంలో మంచి నీటి పైపులు లీకులు ఉంటే మంచి నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని ఆ నీరు తాగి ప్రజల ఆరోగ్యం పాడైతే మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్, శానిటేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై తీవ్ర చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతిరోజూ చేతులు శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టాలని, చేతులు ఎలా శుభ్రపరచుకోవాలో పిల్లలకు వివరించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 124 అర్జీలు అందాయి. కలెక్టర్ నిషాంత్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్య అధికారి డా. కె.విజయ పార్వతి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్ర రావు, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వరరావు, ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయ అధికారి డా.కొయ్యాన అప్పారావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు వినతులు అంతంతమాత్రమే

సీతంపేట: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీతంపేట ఐటీడీఏలో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మొదటి రోజు సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక వెలవెలబోయింది. ఐటీడీఏ ఏపీవో ఎస్‌వీ గణేష్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నాదొరలతో పాటు ఆయా శాఖల అధికారులు ఉదయం 10 గంటల నుంచి వినతుల కోసం ఎదురు చూశారు. 12 గంటల వరకు ఎటువంటి వినతులు రాలేదు. అటు తర్వాత అంతంతమాత్రంగా వివిధ సమస్యలతో వినతిపత్రాలను గిరిజనులు సమర్పించగా మొత్తం 28 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో పీఏవో హరికృష్ణ, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, జీసీసీ మేనేజర్ దాసరి కృష్ణ, ట్రాన్స్‌కో ఈఈ గోపాలకృష్ణ, ఏఈ నీలిమ, సీడీపీవో రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సీతంపేట: వినతుల కోసం వేచి చూస్తున్న అధికారులు


వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ

పార్వతీపురంటౌన్: ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన 14 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిని చట్టపరిధిలో విచారణ చేసి అవసరమైన పరిష్కారం చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బీఎండీ ప్రసాదరావు, డీసీఆర్‌బీ ఎస్సై గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు అలిగిన యువకుడు


తండ్రితో ఇంటికి బయలుదేరిన హరీష్

రాజాం: తల్లిదండ్రుల మీద అలిగి ఇంటి నుంచి బయటకు వచ్చిన ఓ యువకుడు తిరిగి క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేరాడు. జీవితంపై నైరాశ్యంతో బయటకు వచ్చిన ఆ యువకుడికి రాజాం మండలం లక్ష్మీపురం యువకులు కొత్త జీవితాన్ని అందించారు. వివరాలిలా ఉన్నాయి. గుంటూరులోని బీటీఆర్ నగర్‌కు చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న హరీష్ ఇంటివద్ద అలిగి నెలరోజుల క్రితం బయటకు వచ్చేశాడు. తండ్రి కోలా విజయబాబు ఓ హోటల్‌లో టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. తనలా కాకుండా ఉన్నత చదువులు చదవాలని హరీష్‌కు నచ్చజెప్పి చదివిస్తున్నాడు. తండ్రి మాటలు ఇబ్బందికరంగా ఊహించుకున్న హరీష్ ఇల్లు వదిలి బయటకు వచ్చేశాడు. ట్రైన్‌లో ప్రయాణం చేస్తూ హరీష్ జీవితంపై నైరాశ్యాన్ని ప్రదర్శించడంతో అదే ట్రైన్‌లో ప్రయాణిస్తున్న రాజాం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన టి. సంతోష్‌తో పాటు మరికొంతమంది చీపురుపల్లి వద్ద ఆ యువకుడి పరిస్థితి గమనించారు. మెల్లగా మాటల్లో దించి ఆకలితో ఉన్న హరీష్‌కు భోజనం పెట్టించి తమ గ్రామానికి తీసుకొచ్చారు. కొద్దిరోజులు ఇక్కడ ఉంచి అనంతరం యువకుడి గురించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఎన్ని మంచి బుద్ధులు చెప్పినా తల్లిదండ్రుల వద్దకు వెళ్లనని అనడంతో హరీష్‌కు కష్టం విలువ తెలిసేలా చేయాలని యువకులు ఆలోచించారు. గ్రామస్తులతో పాటు పనిచేసుకునేలా హరీష్‌ను పనిలో పెట్టారు. దీంతో కష్టం విలువ తెలుసుకున్న యువకుడు అక్కడ పనిచేయలేక లక్ష్మీపురం గ్రామానికి తిరిగివచ్చి తల్లిదండ్రుల చెంతకు వెళ్లేందుకు ఒప్పుకున్నాడు.

సోషల్ మీడియాలో ప్రచారంతో ఫలితం

ఈలోగా లక్ష్మీపురం యువకులు అంతా ఈ యువకుని వివరాలు వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ యువకుడి వివరాలు గుంటూరులోని తల్లిదండ్రుల వద్దకు చేరాయి. ఫోన్ ద్వారా తమ కుమారుడి యోగాక్షేమాలు తెలుసుకున్న తల్లిదండ్రులు విజయబాబు, సీతమ్మలు కుమారుడిలో మార్పుకోసం తాపత్రయపడ్డారు. హరీష్‌లో మార్పు వచ్చి ఇంటికి వెళ్లిపోతానని చెప్పడంతో అతని తండ్రిని లక్ష్మీపురం రప్పించి, గ్రామపెద్దల సమక్షంలో యువకులు రెండురోజుల క్రితం అప్పగించారు. దీంతో హరీష్ కథ సుఖాంతం అయ్యింది. ఆ యువకునిలో మార్పు తీసుకొచ్చిన గ్రామానికి చెందిన యువతను గ్రామస్తులు అభినందించారు.

పశువులశాల, గడ్డివాము దగ్ధం


కాలిబూడిదైన గడ్డివాము

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేంపూడి గ్రామంలో ఏడువాక శ్రీనివాసరావుకు చెందిన పశువుల శాల, గడ్డివాము దగ్ధమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఎప్పటి మాదిరిగానే రైతు శ్రీనివాస రావు తన ఆవును ఆదివారం సాయంత్రం పశువుల శాలలో కట్టి మేత వేసి ఇంటికి వచ్చేశాడు. రాత్రి 11 గంటలు దాటిన తరువాత ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో అగ్నిప్రమాదం జరిగిందని గుర్తించి కళ్లంలోకి వచ్చి చూడగా పశువుల శాల, గడ్డివాముకు మంటలు వ్యాప్తించి పూర్తిగా కాలిపోయాయి. అయితే ఆ సమయంలో శాలలో ఉన్న ఆవును బయటకు వదిలేశాడు. తన శాల, గడ్డివాముకు ఎవరైనా నిప్పు పెట్టి ఉండవచ్చని అవమానిస్తూ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు.

ర్యాగింగ్ తగదు

• సీఐ వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

పూసపాటిరేగ: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని భోగాపురం రూరల్ సీఐ బి. వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడు అలవాట్లకు లోనుకాకుండా క్రమశిక్షణతో మెలిగి భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పూసపాటిరేగ ఎస్సై ఆరంగి సన్యాసినాయుడు, ప్రిన్సిపాల్ పి. పైడిరాజుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల పేరుతో పుస్తకాల విక్రయం


పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి సంఘం సభ్యులు


పుస్తకాల గొడౌన్

బొబ్బిలి: పట్టణంలోని సురేష్ స్కూల్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల పేరుతో పుస్తకాలు, నోట్‌బుక్కులు విక్రయిస్తోందని రెండు రోజులుగా విద్యార్థి సంఘాలు, యాజమాన్యం మధ్య నడుస్తున్న గొడవ పతాక స్థాయికి చేరింది. విద్యార్థి జేఏసీ కార్యవర్గం రెండు రోజుల క్రితం చేసిన ఆందోళన కారణంగా పాఠశాల విక్రయిస్తున్న పుస్తకాల గొడౌన్‌ను డిప్యూటీ డీఈఓ కార్యాలయం సిబ్బంది సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన గొడౌన్‌ను సోమవారం తెరవడంతో ఎస్ఎఫ్ఐ కార్యవర్గం ఆందోళన చేపట్టింది. ఆ సమయంలో సురేష్ స్కూల్‌యాజమాన్యం ఫిర్యాదుతో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ అధ్యక్షుడు మణికుమార్, మరో నలుగురు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని విడిచిపెట్టారు. ఈ విధానం సరికాదని, కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని ఆందోళన చేసిన వారిని దోషులుగా చూస్తూ యాజమాన్యాల కొమ్ముకాయడమేమిటని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్, సహాయ కార్యదర్శి ఎ.సురేష్, డివిజన్ కార్యదర్శి మణికుమార్‌లు ప్రశ్నించారు. దీనిపై ఆందోళన చేయనున్నట్లు స్పష్టం చేశారు.

జూలై 1 నుంచి 'స్టాప్ డయేరియా కాంపెయిన్'

• కలెక్టర్ నిషాంత్‌కుమార్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: అతిసార నివారణ ప్రచార కార్యక్రమాన్ని (స్టాప్ డయేరియా కాంపెయిన్) జూలై 1 నుంచి ఆస్టు 31వ తేదీ వరకు రెండు నెలలపాటు నిర్వహించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో కార్యక్రమంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యా, వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, తాగునీరు, పారిశుద్ధ్యం, పట్టణ అభివృద్ధి, పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతీ వారం చేపట్టాల్సిన పనులపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ఉండాలన్నారు. పారిశుద్ధ్య డ్రైవ్‌లు నిర్వహించి అతిసార ప్రబలేందుకు అవకాశం ఉన్న స్థలాలను గుర్తించి పరిశుభ్రం చేయాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. చెత్తసేకరణ, వాటి రవాణాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రజా మరుగుదొడ్లను నిరంతరం శుభ్రపరచాలని సూచించారు. బావులు, బోరుబావులు, కొళాయిలను తక్షణం తనిఖీ చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల పిల్లలకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులకు టీకా కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. సౌర విద్యుత్‌తో పనిచేసే తాగు నీటి పథకాలు పని చేయని పరిస్థితి ఉంటే తక్షణం మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, జేసీ ఎస్.ఎస్.శోభిక, జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయపార్వతి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ అధికారి డా.కొయ్యాన అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యం నాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎం.ఎన్.రాణి, జిల్లా మలేరియా అధికారి టి.జగన్‌మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీ రసీదుపై చంద్రబాబు ముఖచిత్రం


వినతుల స్వీకరణలో జేసీ కె.కార్తీక్, డీఆర్ఓ ఎస్‌డీ అనిత


వినతుల అర్జీ రసీదుపై చంద్రబాబు ముఖచిత్రం

విజయనగరం అర్బన్: ఇంతవరకు స్పందన పేరుతో నిర్వహించిన ప్రతి సోమవారం కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం 'ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థ'గా పేరు మార్చిన విషయం తెలిసిందే. అయితే ప్రజల నుంచి వినతుల స్వీకరణ విధానాన్ని కూడా మార్చేసింది. కలెక్టర్‌కు చెప్పుకుంటున్న వినతుల అర్జీ రసీదుపై చంద్రబాబు ముఖచిత్రం ముద్రించారు. పరిష్కారం కాకపోతే చంద్రబాబు బాధ్యుడనే విధంగా ఆ అర్జీ రసీదు ఉంది. గతంలో సంబంధిత శాఖ జిల్లా, మండల అధికారులకు నేరుగా తెలియజేసే విధానం ఉండేది. అర్జీదారుని ఫోన్ నంబర్‌కు సంబంధిత శాఖ సిబ్బంది నుంచి ఫోన్ కాల్ వస్తుంది. వారంరోజుల్లో అది పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకునే వారు. పరిష్కారమైందీ లేనిదీ స్పందన వ్యవస్థ నుంచి నేరుగా ఫోన్ కాల్ ద్వారా అడిగి తెలుసుకునేవారు. సులువుగా పరిష్కారమయ్యే సమస్యలపై నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు ఉండేవి. అయితే ప్రస్తుత ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వ్యవస్థలో ఆ విధానాన్ని రద్దు చేశారు. అర్జీ రసీదులో సమస్యకు సంబంధించిన వివరాలతోపాటు క్యూఆర్ కోడ్ ఒకటి ముద్రించారు. సమస్య పరిష్కారమైందీ లేనిది ఆ క్యూఆర్‌కోడ్ ద్వారా తెలుసుకోవచ్చని చెపుతున్నారు. పరిష్కారం జరగలేదని తెలిస్తే ఎవరిని సంప్రదించాలో అర్జీ క్యూఆర్‌కోడ్‌లో లేకపోవడంతో ఈ విధానం వల్ల ప్రయోజనం లేదని విమర్శలు వస్తున్నాయి.

192 వినతులు

కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థ పేరుతో చేపట్టిన కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి 192 వినతులు అందాయి. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్లు మురళీకృష్ణ, రాజేశ్వరి, నూకరాజు తదితరులు వినతులు స్వీకరించారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

ఎస్పీకి 39 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ఫిర్యాదుదారుల సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు విజయనగరం జిల్లా ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె ప్రజల నుంచి 39 ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యల పరిష్కా రానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, డీటీసీ ఎస్పీ ఎం.వీరకుమార్, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్ఐ గణేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్ట్ పిల్లలకు ఫీజుల్లో రాయితీ ఇవ్వాలి

• కలెక్టర్‌కు ఏపీడబ్ల్యూజే వినతి


వినతి పత్రాన్ని స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుకునే జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ కల్పించాలని ఏపీడబ్ల్యూజే జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులు సోమవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇచ్చేందుకు జిల్లా విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు ఉండేవని అయితే ఏ విద్యా సంస్థ కూడా 50 శాతం రాయితీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితి రాకుండా కలెక్టర్ నేరుగా ప్రొసీడింగ్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులకు ఆదేశాలిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి వీఎస్ఎస్‌వీప్రసాద్, జిల్లా కమిటీ అధ్యక్షుడు అల్లు సూరిబాబు, సీనియర్ జర్నలిస్టులు ఎలిశెట్టి సురేష్, మహాపాత్రో, లక్ష్మణరావు, సుబ్బయ్య పంతులు, డేవిడ్ రాజు, జైరాజ్, బి.శంకరరావు తదితరులు ఉన్నారు.

బోధనేతర సిబ్బందికి కంప్యూటర్‌లో శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో బోధనేతర సిబ్బంది కంప్యూటర్‌లో శిక్షణ కార్యక్రమాన్ని వీసీ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో పనిచేస్తున్న సహాయ సిబ్బంది తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీన్లు ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, సన్నీడియోల్, మురళి, సుబ్రహ్మణ్యం, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాల అడ్డగింత

• సాక్షి కథనానికి స్పందన


చెరువుల్లో జేసీబీ, లారీలు నిలిపివేసిన దృశ్యం

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడు గ్రామం రెవెన్యూ పరిధిలో ఉన్న కొత్త చెరువు, రామరాజు చెరువులో టీడీపీ నేతల మట్టి అక్రమ తవ్వకాలపై సాక్షి పత్రికలో ఆదివారం ప్రచురితమైన 'మనల్ని ఎవడ్రా ఆపేది' కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులపై అధికార పార్టీకి చెందిన నేతలు తవ్వకాలను అడ్డుకోవద్దని హెచ్చరించినట్లు ఆరోపణలు వచ్చాయి. అయినా అనుమతులు లేకుండా తవ్వకాలు జరపవద్దని, తవ్వకాలకు అనుమతులు తీసుకుంటేనే అనుమతిస్తామని రెవెన్యూ అధికారులు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్ అభిప్రాయం కోరగా, అక్రమ తవ్వకాలను సిబ్బందితో అడ్డుకున్నామని, వీఆర్వో నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆ చెరువుల్లో తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని తెలిపారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ పరిశీలన



మాట్లాడుతున్న కేంద్ర నీతిఅయోగ్ అమలు ప్రతినిధి ఘసునందారావు

సీతానగరం: మండలంలోని జోగింపేట కేజీబీవీ విద్యార్థులు కెరియర్ గైడ్‌లైన్స్‌లో నిష్ణాతులు కావాలని నీతిఅయోగ్ (ఢిల్లీ)కేంద్ర ప్రతినిధి సునందారావు ఆకాంక్షించారు. ఈ మేరకు సోమవారం ఆమె జోగింపేట కేజీబీవీని సందర్శించి విద్యార్థులు నిర్వహించే ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించడానికి అమలు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్ విజిట్‌లో భాగంగా కెరియర్ గైడెన్స్ ఇవ్వడానికి ఢిల్లీ నుంచి వచ్చినట్లు తెలియజేశారు. ఇక్కడి విద్యార్థులు వివిధ ప్రాజెక్ట్‌లు తయారు చేయడానికి ఉత్సాహం చూపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.సూరిదేముడు, ప్రిన్సిపాల్ జె.సంధ్య, అటల్ఇన్‌చార్జి శైలజ, శోభారాణి, ల్యాబ్ నిర్వహిస్తున్న విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

కొత్తవలస: జిందాల్ కర్మాగారం యాజమాన్యం కర్మాగారాన్ని అర్ధాంతరంగా మూసేసి కార్మికులను రోడ్డున పడేసిందని న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేదిలేదని కార్మికులు స్పష్టం చేశారు. మండలంలోని అప్పన్నపాలెం గ్రామం సమీపంలో గల జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగారం గత నెల 17వ తేదీన లాకౌట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. నాటి నుంచి కార్మికులు కర్మాగారం గేటు వద్ద వంటావార్పు చేస్తూ నిరసన తెలుపుతున్నారు. అయినప్పటికీ యాజమాన్యం దిగి రాకపోవడంతో గత నాలుగు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యం కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని వాపోయారు.40 సంవత్సరాల పాటు పనిచేసిన కార్మికుల పట్ల కనీసం జాలికూడా లేదన్నారు. కర్మాగారం యాజమాన్యం ఇప్పటికైనా దిగివచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.